- ఫ్లడ్ కెనాల్ నుంచి ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్‌కు అనుసంధాన కాలువ
- ₹30 కోట్లతో మూడు కిలోమీటర్ల మేర నిర్మాణం
- ఐదు నెలల క్రితమే పనులు పూర్తి.. నీటి విడుదల సక్సెస్
- శ్రీరాంసాగర్‌లో నీటి లభ్యత లేకున్నా మూడు జిల్లాల్లో కాలువల చివరి ఆయకట్టుకు సాగునీరు
- డీ-70 నుంచి డీ-94 డిస్ట్రిబ్యూటరీ పరిధిలో రైతులకు మేలు
- చొప్పదండి, ధర్మపురి, కరీంనగర్, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాలకు అదనపు ప్రయోజనం

# గోస తీర్చిన లింక్ కెనాల్


కాకతీయ ప్రధాన కాలువ వద్ద ఏర్పాటు చేసిన గేట్లు, స్లూయిజ్

## వరద కాలువ నుంచి కాకతీయ కాలువకు కాళేశ్వర జలాలు

జగిత్యాల/ పెద్దపల్లి, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం ఏర్పాటు ఉత్తర తెలంగాణ ప్రజల జీవితాలకు ఒక మేలు మలుపైంది. ముఖ్యంగా ఇక్కడి అన్నదాతల జీవితాలు మారిపోయాయి. దాదాపు నాలుగు దశాబ్దాలు ఒకే ఒక్క ఎస్సారెస్పీ ప్రాజెక్టుపై ఆధారపడి సేద్యం చేసిన రైతులు, నాడు ఆయకట్టు చివరి భూములకు నీరందడం లేదంటూ ఆందోళన చేయని సీజన్ ఉండకపోయేది. దురదృష్టవశాత్తూ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండకపోతే, సాగునీటికే కాదు, తాగునీటికి సైతం అల్లాడిన రోజులున్నాయి. కానీ, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రైతులకు మంచిరోజులు వచ్చాయి. సీఎం కేసీఆర్ దూరదృష్టితో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించడంతో గోదావరి జలాలు పరుగులు తీశారు. మొదట మేడిగడ్డ నుంచి కాళేశ్వర జలాలను ఎత్తిపోసి ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి.. అక్కడి నుంచి రామడుగు మండలంలోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిస్తున్నారు. శ్రీరాములపల్లిలోని వరద కాలువ జంక్షన్ పాయింట్ నుంచి దిగువకు తరలించి శ్రీరాజరాజేశ్వర (మధ్య మానేరు) రిజర్వాయర్‌కు నింపుతున్నారు. ఇదే సమయంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు జీవం పోసే లక్ష్యంతో అదే జంక్షన్ పాయింట్ నుంచి వరద కాలువ గుండా ఎగువకు నీటిని ఎత్తిపోసేందుకు ఎస్సారెస్పీ పునర్జీవ మహత్తర పథకాన్నీ గతంలోనే చేపట్టారు. అందుకోసం వరద కాలువపై నిజామాబాద్ జిల్లా ముప్కాల్ వద్ద, జగిత్యాల జిల్లా రాజేశ్వర్‌రావుపేట, రాంపూర్ వద్ద పంప్‌హౌస్‌లను నిర్మించి, కాళేశ్వర జలలాను ఎస్సారెస్పీ దాకా తరలించారు.

### వరద కాలువ నుంచి కాకతీయ కాలువకు లింక్ కెనాల్

ఎస్సారెస్పీ పునర్జీవ పథకంతో దాదాపు 122 కిలోమీటర్ల మేర ఉన్న వరద కాలువ సజీవ నదిలా మారింది. అయితే శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి లభ్యత లేని సమయంలో వరద కాలువ నుంచి కాళేశ్వరం నీటిని ఎస్సారెస్పీ కాకతీయ కాలువలోకి మళ్లించేందుకు లింక్ కెనాల్ నిర్మించాలని నిర్ణయించారు. దీని వల్ల ఎస్సారెస్పీపై పూర్తి భారం తగ్గుతుందని, దీని వల్ల చొప్పదండి, ధర్మపురి, కరీంనగర్, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల్లోని పలు మండలాల ఆయకట్టు భూములకు కాకతీయ డిస్ట్రిబ్యూటరీల ద్వారా పుష్కలంగా నీరందించవచ్చని అధికారులు నివేదికలు రూపొందించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్, అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావును ఒప్పించి ఈ లింక్ కెనాల్ ఏర్పాటు కోసం ₹30కోట్లు మంజూరు చేయించారు. ఆ మేరకు మూడు కిలోమీటర్ల మేర అనుసంధాన కాలువ తవ్వారు. దాదాపు నాలుగున్నరేండ్లలో పనులు పూర్తి చేశారు. ఐదు నెలల క్రితం నుంచి వరద కాలువ ద్వారా కాకతీయ కెనాల్‌కు నీటిని మళ్లించడంతో ఆయకట్టు పరిధిలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### మూడు కిలోమీటర్ల మేర లింక్ కెనాల్

రామడుగు మండలం ర్యాలపల్లిలోని వరద కాలువ 88.400 కిలోమీటర్ మైలు రాయి వద్ద లింక్ కెనాల్‌ను మూడు కిలోమీటర్ల మేర తవ్వారు. మల్యాల మండలం తాటిపల్లి శివారులో కాకతీయ ప్రధాన కాలువపై 97.460 కిలోమీటర్ మైలు రాయి వద్ద లింక్ కెనాల్‌ను అనుసంధానించారు. నీటి విడుదలకుగాను ర్యాలపల్లి గ్రామ పరిధిలో వరద కాలువకు రెండు గేట్లను (స్లూయిజ్) ఏర్పాటు చేశారు. 3,006 క్యూసెక్కుల సామర్థ్యంతో నీటిని తరలించేందుకు ఈ కాలువను ₹30కోట్లతో మూడు కిలోమీటర్ల మేర నిర్మించారు.

### డీ-70 నుంచి డీ-94కు ప్రయోజనం

వరద కాలువ నుంచి లింక్ కెనాల్ ద్వారా కాకతీయ కాలువలోకి నీటిని మళ్లించడం ద్వారా రైతులకు ఎంతో ప్రయోజనం కలుగనున్నది. మెయిన్ కెనాల్‌లోని 70 నుంచి 94 నంబర్లు ఉన్న డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పరిధిలోని పంటలకు పుష్కలంగా నీరందుతున్నది. ఎస్సారెస్పీ ప్రాజెక్టులో నీరు ఉన్నప్పుడే కాకతీయ కాలువల్లో నీరు పారి డిస్ట్రిబ్యూటరీల పరిధిలోకి రైతుల పంటలకు నీరందేది. అయితే ఇప్పుడు ఎస్సారెస్పీలో నీళ్లు


ఎలిగేడు మీదుగా వెళ్తున్న డీ86 ఉప కాల్వ

లేకున్నా, కాళేశ్వరం నీటిని ఎత్తిపోసి, వరద కాలువను ఆసరాగా చేసుకొని, లింక్ కెనాల్ నుంచి కాకతీయ కాలువలోకి మళ్లించుకునే సౌకర్యం కలిగింది. ఈ లింక్ కెనాల్ ద్వారా ఒక ధర్మపురి నియోజకవర్గ పరిధిలోనే 7వేల ఎకరాల ఆయకట్టు రైతులకు ప్రయోజనం చేకూరనున్నది. ధర్మపురితోపాటు చొప్పదండి, కరీంనగర్, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల్లోని పలు డిస్టిబ్యూటరీల రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ఇటీవలే లింక్ కెనాల్ పనులు పూర్తిగా, వారం రోజుల క్రితం నీటిని కాకతీయ కాలువల్లోకి వదిలిపెట్టారు.

### పెద్దపల్లి జిల్లాకు అత్యధిక ప్రయోజనం

పెద్దపల్లి జిల్లాలో ఒకప్పుడు ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు భూముల్లో సగం పండితే.. సగం ఎండే పరిస్థితులు ఉండేవి. కానీ, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన తర్వాత గోదావరి జలాలు సవ్వళ్లు చేస్తున్నాయి. జిల్లాలోని ఎస్సారెస్పీ డీ-83, 86చివరి ఆయకట్టు వరకూ పుష్కలంగా సాగు నీరందుతుండడంతో పంటలు స్థిరీకరణకు నోచుకున్నాయి. జిల్లాలో మొత్తంగా 3,12,808 ఎకరాల భూమి సాగుకు యోగ్యం కాగా, శ్రీరాంసాగర్ డీ-83 కాల్వ కింద 1,03,339 ఎకరాలు, డీ-86 కాలువల కింద 79,360ఎకరాలు మొత్తంగా 1,82,699 ఎకరాలు సాగు కావాల్సి ఉన్నది. డీ-83కాల్వ ద్వారా ధర్మారం, జూలపల్లి, పెద్దపల్లి, కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం, మంథని మండలాల 84.2 కిలోమీటర్లు ప్రవహించి పంటలకు సాగు నీరు అందించాల్సిన లక్ష్యం ఉన్నది. డీ-86కాలువ కూడా చొప్పదండి మీదుగా ఎలిగేడు, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల వరకు 54.2కిలో మీటర్లు ప్రవహించి పంటలకు సాగునీటిని అందించాల్సి ఉంటుంది. అయితే పాలకుల నిర్లక్ష్యం, కాకతీయ కాలువకు పూర్తి సామర్థ్యం మేరకు నీరు రాకపోవడంతో 2014 దాకా డీ-83, 86 కాలువల కింద కేవలం 1,82,699 ఎకరాలకు 1,35,197ఎకరాలు మాత్రమే సాగుకు నోచుకున్నాయి. కొన్ని రోజుల క్రితమే వరద కాలువ నుంచి కాకతీయ కాలువకు లింక్ కెనాల్‌ను అనుసంధానం చేయడంతో పెద్దపల్లి జిల్లా రైతుల దశ తిరిగిపోయింది. కెనాల్ చివరి ఆయకట్టు వరకూ సాగు నీరు పుష్కలంగా అందుతున్నది. దీంతో 30,277ఎకరాలు అదనంగా సాగులోకి వచ్చాయి.

### నాడు సగం పండితే.. సగం ఎండిన చివరి ఆయకట్టు

పెద్దపల్లి జిల్లాలో చివరి ఆయకట్టు రైతాంగానికి ప్రధాన ఆధారమైన డీ83, 86కాల్వల కింద ప్రతి ఏడాది సగం పంట పండితే సగం పంట ఎండడం ఆనవాయితీగా వచ్చేది. ప్రతి ఏడాది రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. చివరి తడుపులు అందక నిద్రాహారాలు మాని కాల్వల వెంట కాపలా కాస్తూ పంటలకు సాగు నీటిని మళ్లించుకునే పరిస్థితి ఉండేది. ఎగువన ఉన్న రైతులు దిగువకు నీళ్లు వెళ్లకుండా అడ్డుకుంటుండడంతో కాల్వల వెంట ఉండే మండలాల రైతుల మధ్య తరచూ గొడవలు సంభవించేవి. చివరగా ఒకటి రెండు తడుపులు అందక ప్రతి ఏడాది రైతులు తీవ్రంగా నష్టపోవడం, సాగుపై భరోసా లేక ఉన్న దాంట్లో సగం మాత్రమే సాగు చేసుకోవడం చేసే వారు. గతేడాది లింకు కెనాల్‌ను అనుసంధానం చేయడం, కాల్వలను పునరుద్ధరించడంతో చివరి ఆయకట్టు దాకా సాగు నీరు పుష్కలంగా అందుతున్నది.



### నాడు పంట ఎండితే గుండె మండి నిప్పు పెట్టిన

మాది నగరంపల్లి. నాకు నాలుగెకరాల పొలం ఉన్నది. ఎస్సారెస్పీ డీ-83 పరిధిలో చివరన ఉంటుంది. మేము ఎప్పుడు పంటేసినా దేవుని మీదే భారం. పండుతదా..? ఎండుతదా..? తెలువని పరిస్థితే ఉండేది. కేసీఆర్ సార్ సీఎం కాక ముందు పంట ఎండుడే ఉండే. ఓ సారి పొలం ఈనింది. ఇగ ఒక్క తడుపైతే పంట వండుతది అనుకుంటుంటే నీళ్లు రాలే. చానా గోసపడ్డా. బాధ పడ్డా. ఏడ్చిన. కానీ నా పొలం తడిసే దారే లేకుండే. బాధ ఆపుకోలేక గుండె రగిలి నా పంటకు నిప్పు వెట్టుకున్న. సగం పండి, సగం ఎండిన పంటను కాలవెట్టి బాధ పడ్డ. ఇప్పుడు అట్లాంటి బాధలు లెవ్వు. సీఎం కేసీఆర్ సార్ అచ్చినంక మా కష్టాలన్నీ తీరినై. ఇప్పుడు పుష్కలంగా నా పొలంకాడికి ఎస్సారెస్పీ నీళు వస్తున్నై. చానా ఆనందంగా ఉంది.

**- పెగడ సంజీవ్ రైతు, నగరంపల్లి గ్రామం (మంథని మండలం)**

### నీళ్లకు ధోకా లేకుంటైంది..

మాకు సాగు నీళ్లకు బాధే ఉండే. తాగునీళ్లకు బాధే ఉండే. కానీ ఇప్పుడు అసలు నీళ్లకు ధోకా లేకుంటనే అయింది.



పుష్కలంగా కాలువ నీళ్లు వస్తున్నై. నేను 15 ఎకరాల భూమి సాగు చేస్తున్నా. వరి, పత్తి, మిర్చి పంటలు వేసిన. గతంలో డీ-86 పరిధిలోని కాల్వ శ్రీరాంపూర్ మండలానికి కాలువ నీళ్లు రాక ఎప్పటికీ పంటలు ఎండిపోయేది. రైతులు ఎప్పటికీ ఏడుసుకుంటనే ఉండేది. కానీ నేడు రెండు పంటలకు సరిపోయే విధంగా పుష్కలంగా కాలువ నీళ్లు అందుతున్నై. ఆంధ్రోళ్ల లెక్క మేం కూడా ఇప్పుడు రెండు పంటలను పండిస్తున్నం.

**- కాసర్ల స్వయం ప్రకాశ్ రెడ్డి, రైతు, మల్యాల (కాల్వశ్రీరాంపూర్ మండలం)**

### ఇప్పుడు ఏ బాధా లేదు



తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ వల్ల రైతులం సాగు నీళ్లు, కరెంట్, ఇంకే బాధ లేకుంట ఎవుసం చేసుకుంటున్నం. నాకు కొలనూర్‌లో మూడె ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గతంలో ఒక ఎకరం పండించుడే గగనమయ్యేది. మొదటి మడి ఒక్కటే పారేది. మిగతాది ఎండిపోయేది. గిప్పుడు నాకు ఉన్న మూడెకరాలకు తోడు మరో ఆరెకరాల భూమిని కౌలుకు తీసుకుని ఎవుసం చేసుకుంటున్న. ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీళ్లు ఎప్పుడు అవసరం ఉంటే అప్పుడు ఇస్తుర్రు. సాగు నీళ్లకు ఢోకా లేదు గిప్పుడు. అది కేసీఆర్ సార్ చలువే.

**- కొల్లూరి మధునయ్య, రైతు, కొలనూర్(ఓదెల మండలం)**

### దోపసల్ పండిస్తన్నం

మాకు మునుపు ఒక్క పంటకే దిక్కు లేకుండే. వారబంధీ లెక్క. కాల్వ నీళ్లు వత్తె వచ్చేది లేకుంటే లేదు. మీది రైతులు



కిందికి నీళ్లు రాకుంట ఆపుకునేటోళ్లు. ఆళ్లు రైతులే మేం రైతులే. కానీ ఎస్సారెస్పీ డీ-86కింద ఉన్నందుకు మేం గోసపడేది. ఇప్పుడు ఆ బాధలు తీరినై. రెండు పంటలకు పుష్కలంగా సాగునీళ్లు వస్తున్నై. నాడు నీళ్ల కోసం ఎదురుచూసేది. నేడు ఆ పరిస్థితి లేదు. రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు అందుతుంది. దోపసల్ పండిస్తున్నం. కోనసీమను తలపించే విధంగా ఎటు చూసినా పచ్చని పైరులతో పంట పొలాలు ఉన్నాయి.

**- కాంటాల వీరన్న, రైతు, ఆరేపల్లి గ్రామం (కాల్వ శ్రీరాంపూర్ మండలం)**



### నీళ్లకు ఎదురు చూడడం లేదు

ఎవుసంజేత్తె యమ గోస ఉండేది. ఇటు నీళ్లకు ఎదురు సూసుడు. అటు కరంటుకు సూసుడు. ఎరువులకు సూసుడు. అన్నిటికీ ఎదురుసూసుడే గానీ ఎదురచ్చేవి కాదు. ఇప్పుడు అట్ల గాదు. ఎదురు సూడాల్సిన అవసరం లేదు. రైతు దగ్గరికే నీళ్లత్తన్నె. కరెంటత్తంది. సరిపోయేన్ని ఎరువులత్తన్నె. మాకు వర్షాధార పంటలు ఉండే. ఎస్సారెస్పీ కెనాల్ నుంచి నీరు వస్తే పంటలు పండేవి. లేకుంటే ఎండేవి. గతంలో నీరు రాకుంటే అప్పులు చేసి బోర్లు వేసినం. కానీ కరెంట్ కష్టాలు ఉండె. ఇప్పుడు ఉన్న బోరును వాడుతలేం. పుష్కలంగా కాల్వ నీళ్లు వత్తన్నె. బోర్లు ఖాలీగనే ఉంటున్నె.

**-లింగం రాజయ్య, రైతు, సీతంపల్లి (ముత్తారం మండలం)**